లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం


సినిమా థియేటర్‌లో లోక్ అదాలత్ వీడియో చూస్తున్న పాలనాధికారి డా.సత్యశారద, జిల్లా న్యాయమూర్తి వి.నిర్మలాగీతాంబ

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలను ఈ నెల 28న జరిగే లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా.. జిల్లావ్యాప్తంగా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. అందులో భాగంగా వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఓ సినిమా థియేటర్‌లో ప్రసారమవుతున్న లోక్ అదాలత్ ప్రచార వీడియోను మంగళవారం జిల్లా న్యాయమూర్తి వి.నిర్మలాగీతాంబ, డీసీపీ రవీందర్‌లతో కలిసి జిల్లా పాలనాధికారి డా.సత్యశారద వీక్షించారు.

మండల విద్యాశాఖ అధికారుల నియామకం

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 13 మండలాలకు మండల విద్యాశాఖ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొద్ది సంవత్సరాలుగా నాలుగు మండలాలకు ఒక్కరే ఇన్‌ఛార్జి ఎంఈవో ఉండడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. విద్యా వ్యవస్థ గాడితప్పింది. సర్కారు పాఠశాలల్లో చదివే పిల్లలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో మండలంలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఆయా మండల విద్యాశాఖ అధికారులుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయపర్తి- ఎన్.రంగయ్య, నెక్కొండ- వి.రత్నమాల, పర్వతగిరి- జి.లింగారెడ్డి, సంగెం- జి.రాము, వర్ధన్నపేట- ఎ.శ్రీధర్, నర్సంపేట- కె.సారయ్య, గీసుగొండ- వై.సాంబయ్య, వరంగల్- జి.అశోక్‌కుమార్, చెన్నారావుపేట- బి.సరళ, ఖానాపూర్- డి.శ్రీదేవి, నల్లబెల్లి- ఎ.వసంత, దుగ్గొండి- ఎస్.వెంకటేశ్వర్లు, ఖిలా వరంగల్- బి.ప్రసాద్‌లను నియమించారు.

కాలనీలను ముంచెత్తిన వరద


జలమయమైన హంటర్‌రోడ్ ఎన్టీఆర్‌నగర్

రామన్నపేట, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు నీటమునిగాయి. బొందివాగు నాలా ఉద్ధృతితో సమీపంలో ఉన్న హంటర్‌రోడ్ ఎన్టీఆర్‌నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, సాయినగర్, గాయత్రి నగర్‌లోకి మంగళవారం తెల్లవారుజామున వరద పోటెత్తింది. దీంతో స్థానికులు ఆగమేఘాల మీద బయటకు వచ్చారు. గ్రేటర్ వరంగల్ అధికారులు ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన 10-15 ఇళ్లను ఖాళీ చేయించి.. వరంగల్ పోతనరోడ్ మార్వాడీ సామాజిక భవనానికి తరలించారు. పునరావాస కేంద్రానికి వచ్చిన 50 మందికి అల్పాహారం, భోజనాలు వడ్డించారు.

ఖానాపురం: అకాల వర్షంతో మంగళవారం బుధరావుపేట, ఖానాపురంలో ఆరబోసిన మక్కలు తడిశాయి. మార్కెటు ఉపకేంద్రంలో సరైన వసతులు లేకపోవడంతో మక్కలు తడిశాయని రైతులు వాపోయారు.


మంగళవారం తెల్లవారుజామున ఇల్లు ఖాళీ చేసి బయటకు వస్తున్న కాలనీవాసులు


పోతనరోడ్ పునరావాస కేంద్రంలో భోజనాలు

ఉత్సాహంగా ఉత్కర్ష-24 వేడుకలు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్కర్ష-24 ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డా.ఆశాదేవి విద్యార్థులను అభినందించారు. సాయంత్రం విద్యార్థులు 'కార్నివాల్ నైట్ మ్యూజిక్ బ్యాండ్' నిర్వహించారు. పాటలతో అలరించారు. ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేసి విభిన్న రుచులు చూపించారు. బుధవారం దాండియా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్య విద్యార్థులు తెలిపారు.


'మ్యూజికల్ బ్యాండ్' కార్యక్రమంలో వైద్య విద్యార్థుల ప్రదర్శన



రక్తదానం చేసిన వైద్య విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం రక్తనిధి కేంద్రం వైద్యాధికారి ఆశాదేవి

'ప్రశస్త' యాప్ నిర్వహణపై శిక్షణ

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లోని వైకల్యాలను ప్రాథమికంగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రశస్త' మొబైల్ యాప్ నిర్వహణపై కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి సుభాశ్ ఉపాధ్యాయులకు వివరించారు. వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థిని నిశితంగా పరిశీలించి, వారిలో ఒకవేళ వైకల్యాలుంటే యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎంవో సుజన్‌తేజా, పాఠశాల ప్రిన్సిపల్ అశోక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

కోడి కూయక ముందే..

మద్యం జోరు!



రహదారులపైనే తాగుతూ.. ఊగుతూ...!

వరంగల్‌క్రైం, గిర్మాజీపేట, న్యూస్‌టుడే

ఒకప్పుడు పండగకో.. పబ్బానికో మద్యం తాగేవారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం అవసరం లేదనిపిస్తోంది. ఎప్పుడు పడితే.. అప్పుడే.. ఎక్కడపడితే అక్కడే.. అది అందుబాటులో ఉండడంతో.. చాలామంది దానికి బానిసలవుతున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టుషాపు దర్శనమిస్తోంది. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో కోడి కూయక ముందే ప్రారంభమై రాత్రి ఒంటిగంట వరకు బార్లు డోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. ఆబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం 'న్యూస్‌టుడే బృందం' నిర్వహించిన పరిశీలనలో సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, పలువురు రహదారుల పక్కనే కూర్చొని మద్యం తాగుతూ కనిపించారు.

మీకు తెలుసా..

'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019–22 ప్రకారం.. దేశంలో అత్యధికంగా తాగుడు అలవాటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.. రాష్ట్రంలో 43 శాతం మందికి మద్యం తాగే అలవాటున్నట్లు వెల్లడైంది. మరోవైపు మద్యానికి బానిసై.. డీఅడిక్షన్ కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

ఇవీ నిబంధనలు..

- మద్యం దుకాణాలు (వైన్స్) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉండాలి. బార్లకు 11 వరకు అనుమతి ఉంటుంది.
- ప్రతి దుకాణానికి ప్రభుత్వం మద్యం తాగడానికి గది అనుమతి ఇస్తుంది. అది లేనప్పుడు దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాలి.
- వైన్స్ ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుండాలి.
- 21 ఏళ్ల లోపువారికి మద్యం అమ్మొద్దు.
- మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించకూడదు.
- జాతీయ రహదారులకు 225 మీటర్ల లోపు మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు. గుడి, బడికి 100 మీటర్ల లోపు ఉండొద్దు.
- మద్యం కల్తీ జరగకుండా పర్యవేక్షణ తప్పనిసరి.

ఇదీ పరిస్థితి..

- సాయంత్రం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రహదారికి ఆనుకుని ఉన్నచోట వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- రాత్రి 10 తర్వాతా మద్యం విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాన్ని తెరిచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- వయసుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం అమ్ముతున్నారు.
- ప్రత్యేక సాకులు చూపి రహదారులపైనే నిర్వహిస్తున్నారు.
- మద్యం దుకాణాల వద్ద ఆహార పదార్థాలు, తినుబండారాలు అమ్మకూడదు. అధికారులు ఇవేవీ పట్టించుకోరు.
- అనేక చోట్ల రోడ్డు వెంట ఉన్న మద్యం దుకాణాలతో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇష్టారీతిన అమ్మకాలు చేస్తున్నారు. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిల్‌కు రూ.30, 50, 100 చొప్పున అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు.

కళాశాల ఆవరణలో..

రాయపర్తి: రాయపర్తి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు 170 మీటర్ల దూరంలో వైన్స్ ఏర్పాటు చేశారు. మందుబాబులు రాత్రి వేళల్లో కళాశాలకు వెళ్లే రహదారి, కాలేజీలో నిత్యం మద్యంతాగి సీసాలతో పాటు వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు.

గుడి వెనకాలే 'బార్ అండ్ రెస్టారెంట్'

మట్టెవాడ: వరంగల్‌లోని ప్రధాన కూడలిలో గోపాలస్వామి గుడి కూడలి ఒకటి. పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లే మార్గంలో త్రిశక్తిపీఠం దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి అత్యంత సమీపంలో మద్యం దుకాణాలున్నాయి.



ఉదయం 8.45 గంటలకు తెరుచుకుని ఉన్న కాశీబుగ్గ సర్కిల్‌లోని ఓ బార్. ఇక్కడ తెల్లవారుజామున 5 గంటల నుంచే మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి.



ఉదయం 8.20 గంటలకు తెరుచుకుని ఉన్న ఓసిటీకి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలోని బార్



నర్సంపేట పట్టణంలో 365 నంబరు జాతీయ రహదారికి ఆనుకునే నాలుగు దుకాణాలు ఉన్నాయి. రహదారి పక్కన, ఇతర దుకాణాల వద్ద నిల్చొని తాగుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

\- న్యూస్‌టుడే, నర్సంపేట

భద్రకాళి ఆలయంలో ప్రసాదాల తనిఖీ

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవాలయంలో లడ్డు, పులిహోర ప్రసాదాల తయారీని మంగళవారం జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి కృష్ణమూర్తి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ జారీ చేసిన దిట్టం ఉత్తర్వుల ప్రకారం ముడి సరకుల నాణ్యత, నెయ్యి తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల నమూనాలు తీసుకున్నారు. ఈవో శేషుభారతి, పర్యవేక్షకుడు విజయ్‌కుమార్ తదితరులున్నారు.

సేవా మార్గాలు సూచించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో మంగళవారం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ప్రజలకు సేవ చేసే మార్గాలను సూచించడమే ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీ.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాములునాయక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు భగీరథ్, వీరాంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ ప్రేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పడిపోతున్న మక్కల ధర!

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఎనుమాముల మార్కెట్‌లో మక్కల ధరలు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నెల 12న మక్కలకు క్వింటా 3,070 ధర రావడంతో ఈసారి పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతుంది. మంగళవారం క్వింటాకు రూ.2,590 పలకడంతో.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో తేమ సాకుతో రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ.వందల్లో కోత విధించడంపై మార్కెట్ అధికారులు దృష్టి సారించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్త పత్తి ధరలు తగ్గుతుండటంతో.. రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం క్వింటా కొత్త పత్తికి రూ.7,510 పలకగా.. మంగళవారం క్వింటా 7,225 ధర పలికింది.

నిర్ణీత గడువులోగా ఓటరు జాబితా సవరణ

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా నిర్ణీత గడువులోగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమైందని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుంచి 95 శాతానికి చేరుకుందన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్వో నెట్ 2.0 తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాలనాధికారి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు

వరంగల్ కలెక్టరేట్: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలు పాటించాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎంతమంది రైతులు ఏయే పంటలు వేశారో నివేదికలు తయారు చేయాలన్నారు. నివేదికల ఆధారంగా ఎంత పంట కొనుగోలు కేంద్రాలకు చేరుతుందో.. ఆ మేరకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకుముందు ఎనుమాముల మార్కెట్ అధికారులతో జరిగిన సమావేశంలో.. పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. వ్యవసాయశాఖ అధికారి అనురాధ, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరసనలు.. నినాదాలు

- రసాభాసగా గ్రేటర్ కౌన్సిల్ సమావేశం
- రూ.100 కోట్ల నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నపం


మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం నినాదాలు, పరస్పర ఆరోపణలతో వేడెక్కింది. మంగళవారం ఉదయం సమావేశం ప్రారంభానికి ముందే భారాస, భాజపా కార్పొరేటర్లు నిరసనకు దిగారు. కౌన్సిల్ హాల్ ఎదుట భారాసకు చెందిన ఉప మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, సిద్ధం రాజు, నర్సింగ్ తదితరులు బైఠాయించారు. భాజపా కార్పొరేటర్లు అభినవ్ భాస్కర్, కోమల, వసంత, వరలక్ష్మి, గందె కల్పన తదితరులు కొత్త భవనం గేటు ఎదుట ధర్నా చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో కార్పొరేటర్లు సమావేశ మందిరంలోకి వెళ్లిపోయారు.

\- కార్పొరేషన్, న్యూస్‌టుడే


మేయర్ పోడియం ముందు బైఠాయించిన భారాస కార్పొరేటర్లు

అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం..

మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే నిధుల కేటాయింపులో ప్రతిపక్ష కార్పొరేటర్లపై వివక్ష చూపడాన్ని నిరసిస్తూ.. భారాస కార్పొరేటర్లు మేయర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో కాసేపు వాగ్వాదానికి దిగారు. అరగంట పాటు నిరసనలు, నినాదాలు కొనసాగాయి.

- మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బల్దియా అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కార్పొరేటర్లు అడిగిన ప్రతి సమస్యకు జవాబు చెప్పించారు. గ్రేటర్ వరంగల్‌లో నిధుల కొరత ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.100 కోట్లు విడుదల చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ, అధికారులు పాల్గొన్నారు.

తిరస్కరణ.. ఆమోదం

- కౌన్సిల్ సమావేశం ఎజెండాలో మొత్తం 17 అంశాలు పెట్టారు. ఇండోర్ స్టేడియం కోచ్ పదవీకాలం పొడిగింపు మినహా మిగిలినవి ఆమోదించారు.
- ముఖ్యమంత్రి హామీల పథకం కింద పనులు చేసిన గుత్తేదారుకు బల్దియా సాధారణ నిధుల నుంచి రూ.67 లక్షలు ఇచ్చేందుకు మంత్రితో సహా అందరూ వ్యతిరేకించారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు.. ఆమోదం తెలిపారు.
- మెప్మా టీఎంసీ రమేశ్ ఆర్పీలను ఇబ్బంది పెడుతున్నారని, అతడిని సస్పెండ్ చేయాలని మంత్రి సురేఖ లేఖ ఇచ్చారు. తర్వాత మేయర్ ఛాంబర్‌లోకి పిలిపించి ఇదే చివరి అవకాశమని టీఎంసీని హెచ్చరించారు.
- ఆస్తిపన్ను 25 రెట్ల జరిమానాలు రద్దు పర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ నల్లా కనెక్షన్ల పన్ను రద్దుకు నిర్ణయించారు.
- కొత్తగా 250 మంది తాత్కాలిక కార్మికులను నియమించేందుకు తీర్మానించారు.
- భారాస, భాజపా కార్పొరేటర్లకు నిధులు ఇస్తామన్నారు. రూ.5 లక్షల నామినేషన్ పనులు కేటాయించేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్యం అధ్వానం

- నగరంలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని మంత్రి సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయన్నారు. కమిషనర్, సీఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు వారానికి నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు.
- ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారుల ఇళ్లలో పని చేసే కార్మికులను వెనక్కి రప్పించాలని మంత్రి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఇన్‌స్పెక్టర్లు, జవాన్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు..
- నగరంలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్‌ప్లానింగ్ పనితీరు సరిగా లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో ఇంజినీర్లపై మండిపడ్డారు.

భారాస వాకౌట్

- సమావేశం ఆరంభం నుంచి భారాస కార్పొరేటర్ల నిరసనల పర్వం కొనసాగింది. భారాస కార్పొరేటర్లు మాట్లాడేందుకు మేయర్ సమయం ఇవ్వకపోవడంతో ఉప మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- తన డివిజన్‌లో సమస్యలు వివరించేందుకు మేయర్ అవకాశం ఇవ్వలేదని కార్పొరేటర్ మరుపల్ల రవి ఆరోపించారు. భారాస నుంచి గెలిచిన మేయర్ తక్షణం రాజీనామా చేసి.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందాలని డిమాండ్ చేశారు.

సమస్యల వెల్లువ

- డివిజన్లలో నెలకొన్న సమస్యలపై కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. తాగునీటి సరఫరా, పైపులైన్ లీకేజీలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, దోమలు, కోతులు, కుక్కల బెడద సమస్యలను సమావేశంలో వివరించారు.
- రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన కార్పొరేషన్ వాహనాలు వృథాగా పడి ఉన్నాయని కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు ఆరోపించారు.
- హనుమకొండ నయీంనగర్ నాలాపై కొత్త వంతెన పనులు సరే.. ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం, రాజాజీనగర్ వంతెన పనులెందుకు చేపట్టడం లేదని భాజపా కార్పొరేటర్ స్వాతిరెడ్డి ప్రశ్నించారు.
- ఒకే గుత్తేదారుకు 4-6 పనులు ఇవ్వడం సరికాదని, దీనివల్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు.
- కాంగ్రెస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌కుమార్ సభలో మాట్లాడటానికి అనుమతి కోసం పలుమార్లు మేయర్‌ను అభ్యర్థించారు. అవకాశం ఇవ్వకపోవడంతో ప్లకార్డు చూపుతూ.. సమావేశం నుంచి బయటకు వచ్చారు.


సమావేశంలో పాల్గొన్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, రేవూరి, నాగరాజు, కార్పొరేటర్లు

మేయర్ తీరు దారుణం

- రిజ్వానా షమీమ్, ఉప మేయర్

మేయర్ సుధారాణి తీరు సరిగాలేదు. డిప్యూటీ మేయర్‌కు కనీస గౌరవం ఇవ్వలేదు. ఇది కాంగ్రెస్ కౌన్సిల్ సమావేశంలా అనిపించింది. నిధులివ్వడం లేదు.. సమస్యలు చెబుదామంటే మైకు ఇవ్వలేదు.

అందరికీ నిధులిస్తాం

- గుండు సుధారాణి, మేయర్

పార్టీలకు అతీతంగా అన్ని డివిజన్ల కార్పొరేటర్లకు నిధులు ఇస్తాం. నాకు అందరూ సమానమే. వరంగల్ నగరాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. అండర్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ కేబుల్ డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి.

కల్తీ ముప్పు.. కనిపెడితేనే మేలు..!



"తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో జరిగిన తప్పిదాలు పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న నేపథ్యంలో కల్తీపై అంతటా చర్చ జరుగుతోంది. ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలోనే కాదు మన నిత్య జీవితంలో వాడే ఆహారపదార్థాల్లోనూ కల్తీ జరుగుతోంది. దీన్ని గుర్తించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనదే"



ప్రస్తుతం కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్టుగా రోజులు మారాయి. విపణిలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. మనం చూసే ప్రతిదీ అందంగా ఆకర్షించేలా కనిపిస్తున్నా లోపల మాత్రం ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు జోడించి తయారు చేసిన ఉత్పత్తులుంటున్నాయి. నిత్యం ఆరోగ్య రక్షణకు వినియోగించే సర్వరోగ నివారిణి తేనె, తాగే పాలు మొదలు వంటకాల్లో వాడే నూనె, కారం, పసుపు నుంచి మసాలా వరకు కల్తీ బారిన పడినవే. వాటిని తింటూ వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో పదార్థాల నాణ్యత తనిఖీ చేయడం అవసరం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన పద్ధతి ప్రకారం ఇంట్లోనే కల్తీని గుర్తించే విధానంపైనే కథనం.

– ఈనాడు, మహబూబాబాద్

అనారోగ్య సమస్యలివే..



కల్తీ ఆహార ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, పక్షవాతం, క్యాన్సర్, కంటి వ్యాధులు సంభవిస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ బానోత్ నెహారాథోడ్, ఎండీ ఫిజీషియన్



పాలు



● కల్తీ చేసే పదార్థాలు: స్టార్చ్ (పిండి పదార్థాలు), డిటర్జెంట్ పౌడర్

● గుర్తించే విధానం: 5-10 ఎం.ఎల్. పాలు తీసుకుని వాటికి సమానమైన నీటితో బాగా కలపాలి. డిటర్జెంట్ కలిపి ఉంటే చిక్కని నురగ వస్తుంది. స్వచ్ఛమైన పాలు అయితే సన్నని నురగ పొర ఏర్పడుతుంది. పాలను వేడి చేసి అందులో కొన్ని చుక్కల అయోడిన్ వేస్తే అవి నీలం రంగులోకి మారితే స్టార్చ్ (పిండిపదార్థాలు)లతో కల్తీ చేసినట్లే.

కారం



● ఇటుక పొడి, సింథటిక్ కలర్

● గాజు గ్లాసులో నీటిని తీసుకుని అందులో మిరపపొడిని వేయాలి. ఇటుక పొడి ఉంటే అది నీటి అడుగుభాగానికి చేరుతుంది. గాజు పాత్రలో నీటిపై కారం పొడిని వేస్తే కృత్రిమ (సింథటిక్) రంగు చారల రూపంలో కిందికి దిగుతుంది.

నల్ల మిరియాలు



● బొప్పాయి గింజలు

● ఒక గ్లాసు నీటిలో కొంత మొత్తంలో నల్ల మిరియాలు వేయాలి. స్వచ్ఛమైనవి అడుగు భాగానికి చేరుకుంటాయి. బొప్పాయి గింజలు నీటిపై తేలుతాయి.

కాకరకాయ, పచ్చిమిర్చి, ఇతర ఆకుకూరలు



● ఆకర్షించేలా కృత్రిమ రంగు పూయడం

● నీటిలో, వెజిటబుల్ ఆయిల్‌లో ముంచిన పత్తి దూదిని తీసుకోవాలి. దాన్ని కూరగాయలపైన రుద్దాలి. దూది ఆకుపచ్చగా మారితే వాటిని కృత్రిమ రంగుతో కల్తీ చేసినట్లు.

తేనె



● చక్కెర ద్రావణం

● స్వచ్ఛమైన తేనెకు మండే స్వభావం ఉంటుంది. నాణ్యమైన తేనెలో పత్తిని ముంచి మండిస్తే మండుతుంది. ● ట్రాన్స్‌పరెంట్ గ్లాసు పాత్రలో నీళ్లు తీసుకోవాలి. అందులో కొద్దిగా తేనె వేస్తే అది విడిపోతే అందులో చక్కెర ఉన్నట్లు గుర్తించాలి. ● గిన్నెలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా తేనె వేసి వేడి చేయాలి. అప్పుడు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తే చక్కెర కలిపినట్లు. కల్తీ జరగకుంటే ఎలాంటి శబ్దం రాదు. ● ఒక గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకుని అందులో ఒక చెంచా తేనె కలిపి కాస్త వెనిగర్ వేయాలి. నురగ వస్తే అది కల్తీ అయినట్లు.

నెయ్యి



● పిండిపదార్థం

● గాజు గ్లాసులో కొద్దిగా నెయ్యిని తీసుకొని అయోడిన్ ద్రావణాన్ని కలపాలి. నీలంరంగులోకి మారితే పిండి పదార్థాలతో కల్తీ చేసినట్లు.

ఒక చెంచా నెయ్యిని ఒక గ్లాసు నీటిలో కలిపితే స్వచ్ఛమైన నెయ్యి ఉపరితలంపై తేలుతుంది. నీటిలో కలిసినా, దిగువకు చేరితే అది నూనెలతో కల్తీ కావొచ్చని అర్థం.

పసుపు



● మెటానిల్ ఎల్లో, సన్‌సెట్ ఎల్లో, బియ్యం పిండి

● పరీక్ష నాళికలో కొద్దిగా పసుపు పొడిని తీసుకుని నీటిని కలపాలి. గాఢమైన పసుపు రంగు ఏర్పడితే కల్తీ జరిగినట్లు. బియ్యం పిండి ఉంటే నీటి అడుగుకు చేరుతుంది.

కంది, పెసర పప్పు



● కేసరి పప్పు, మెటానిల్ ఎల్లో రంగు, టట్రాజయిన్

● కేసరి పప్పు పలుకులుగా ఉంటుంది. దీన్ని భూతద్దం సహాయంతో గుర్తించొచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా కంది/పెసర పప్పును తీసుకుని కొద్దిగా నీటిని కలిపి దానికి 5ఎం.ఎల్. గాఢ హైడ్రోక్లోరికామ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

టీ/కాఫీ పొడి



● ఇనుప పొడి, కృత్రిమ రంగులు, చింతగింజల పొడి

● టీపొడిని కొద్దిగా తెల్లని కాగితంపై పలచగా పోసి దాన్లో అయస్కాంతాన్ని తిప్పితే ఇనుప పొడి దానికి అతుక్కుంటుంది.

● చల్లని నీటిలో టీపొడిని కలిపితే 30 సెకన్లలోనే నీటి రంగు మారితే అది కల్తీ అయినట్లు.

● కాఫీ పొడిని చల్లని నీటిలో బాగా కలిపాలి. కాఫీ పొడి నీటిపై తేలి చింతగింజల పొడి ఉంటే అడుగు భాగానికి చేరి నీటిని మట్టి రంగులోకి మారుస్తుంది.

వేరుశనగ, నువ్వుల నూనె



● సోయాబీన్, ఆర్జిమోన్ నూనె

● ఒక పరీక్షనాళికలో కొద్దిగా నూనె, 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లం, కొద్దిగా పంచదార కలిపాలి. పరీక్ష నాళిక దిగువన గులాబీ, ఎరుపు రంగు ఏర్పడితే నూనెలు కల్తీ అయినట్లు.

కొబ్బరి నూనె



● మినరల్ ఆయిల్, పామ్ కెర్నల్

● శుద్ధమైన కొబ్బరి నూనెను ఫ్రిజ్‌లో పెట్టి అరగంట తర్వాత చూస్తే పూర్తిగా గడ్డకడుతుంది. సగం గడ్డకట్టి.. సగం కట్టకుంటే కల్తీ అయినట్లు.

ఇవి కూడా..



● అందరూ ఎంతో ఇష్టంగా తినే మిఠాయిల్లో రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. 100 పీపీఎం కంటే ఎక్కువగా కలిపిన మిఠాయిలను తింటే అనారోగ్యానికి దారి తీస్తాయి. ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మిఠాయి దుకాణంలో ఆహార భద్రతా అధికారులు వాటిని గుర్తించి జరిమానా విధించారు.

● కొబ్బరి పొడిలోనూ నాణ్యత లేనిది ఉంటుంది. కొబ్బరిపొడిలో 55శాతం నూనె ఉండాలి. లేకుంటే నాణ్యత లేనట్లు.

హనుమకొండలో 45 శాతం నూనె ఉన్న ఒక కంపెనీకి చెందిన కొబ్బరి పొడిని స్వాధీనం చేసుకున్నారు.



వారసంతల్లో ఎక్కువగా..

ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని వారసంత. ప్రతి మంగళవారం నిర్వహిస్తారు. వంటింట్లోకి అవసరమైన అన్ని సరకులను ఇలా పెట్టి విక్రయిస్తారు. ఇక్కడ కల్తీ ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పసుపు, పప్పులు, ఉల్లిగడ్డలు, సుగంధ ద్రవ్యాలు ఇలా ప్రతిదీ నాణ్యత లినివే ఉంటాయి. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లోంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఇలా చేద్దాం

కారం పొడిని రైతుల వద్ద, ఎండు మిర్చి విక్రయాలు చేసే దుకాణాల వద్ద ఏడాదికి సరిపడా కొనుగోలు చేసి మరాడించుకుని భద్రపరుచుకుంటే చాలు. కల్తీ కారం నుంచి బయటపడొచ్చు. ఇలా కాకుండా ప్యాకెట్లలోని కారం కొనుగోలు చేయాలనుకుంటే ఆహార పరిరక్షణ ప్రమాణాల ప్రకారం ఉందా లేదా చెక్ చేసుకుని కొనాలి.

● గేదెలు సాకుతూ పాలను పట్టణాల్లోకి తీసుకొచ్చి విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయాలి. గ్రామాల్లో ఆవులు, గేదెలను పోషిస్తూ వాటి పాల ద్వారా నెయ్యిని తీసి విక్రయాలు చేస్తారు. వారి వద్ద నాణ్యమైంది లభిస్తుంది.. దానికి ధర అధికంగా ఉన్నా కొనుగోలు చేయడం ఉత్తమం.

● పసుపు సాగు చేసే కొందరు రైతులు దాన్ని ఉడికించిన తర్వాత పసుపు పొడిగా మరాడించి విక్రయాలు చేస్తారు. వారి వద్ద కొంటే కల్తీ బారి నుంచి తప్పించుకోవచ్చు.

● తేనె రోడ్లపక్కన పెట్టి విక్రయాలు చేసే వారి వద్ద కొనుగోలు చెయ్యొద్దు. గ్రామాలు, ఏజెన్సీ గూడేలు, తండాల్లో చెట్లకు ఉన్న తుట్టెల ద్వారా సేకరించిన తేనెను గానీ, తేనెటీగల పెంపకం చేపడుతూ తేనె విక్రయించే వారి వద్ద తీసుకోవాలి. కొన్ని అధీకృత కంపెనీల వారు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. వాటిని కూడా కొనుగోలు చెయ్యొచ్చు.

'దోచుకోవడం, దాచుకోవడం తప్ప భారాస చేసిందేమీ లేదు'



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం రూ. లక్షల కోట్ల అప్పులు చేసిందని, తీవ్ర ఆర్థిక లోటు ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీలేదని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాల్లో అయిదు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. భారాస ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం నాలుగైదు కార్పొరేటు ఆసుపత్రులకు మాత్రమే ఎల్వోసీలు ఇచ్చారన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, విద్య, వైద్యం, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



ప్రముఖుల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్.. చిత్రంలో పాలనాధికారి రాహుల్ శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్ర మలివిడత అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది.. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలపైనా దృష్టి సారించారు. కాళేశ్వర క్షేత్ర సన్నిధిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంత రావు, జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో క్షేత్ర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్మాణాలు ఎంతమేరకు పూర్తి కావచ్చాయి..? మిగతా నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈవో మారుతిని ప్రశ్నించారు. సత్వరమే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. రాబోయే సరస్వతీ పుష్కరాలకు ఏవిధంగా ప్రణాళిక చేస్తే బాగుంటుందని అధికారుల వద్ద సలహాలు తీసుకున్నారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులను పలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద బృందావన్ గార్డెన్ మాదిరి పర్యాటక ప్రాంతం అవసరమని, చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తే సందర్శకులు, చిన్నారి విద్యార్థులకు గొప్ప అనుభూతి కలిగిస్తుందని పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి సూచించారు. బృహత్తర ప్రణాళిక అమలుకు ముందు ఆలయ నిర్మాణాల తీరుపై శృంగేరి పీఠం వారికి వివరించాలని దేవాదాయశాఖ స్థపతి వల్లీ నాయగం సూచించారు. రూ.115 కోట్లతో కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీఎం వివరించారు. గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రతకు తావులేకుండా పవిత్రతకు మారుపేరులా ఉండాలని శైలజారామయ్యార్ ఆదేశించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అతిథిగృహాలు అస్తికలు నిమజ్జనం చేసే భక్తులకు ఆలయ సిబ్బంది ఇవ్వడం లేదని కాళేశ్వరాలయం మాజీ ఛైర్మన్ కోటరాజ బాపు, మాజీ ధర్మకర్త అశోక్ ఆమె దృష్టికి తీసుకురాగా ఈవోపై మండిపడ్డారు. క్షేత్ర ఆవరణలో భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ టాయిలెట్స్ నిర్మాణాలు జరగాలని ఆదేశించారు.

నిజాయతీతో సేవలందిస్తే గుర్తింపు



సీపీని కలిసిన ఎస్సైలు అభ్యర్థులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రజలకు నీతి, నిజాయతీతో సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన శిక్షణ పొందిన 19 మంది ఎస్సైలు మంగళవారం కమిషనరేట్‌లో సీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. చట్టం పరిధిలో సేవలు అందిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్ఠలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



మల్లకపల్లి శివారులో మొరం కోసం వచ్చిన వాహనాలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ మండలం మల్లకపల్లి నుంచి రాంపూర్‌కు వెళ్లే దారిలో గుట్టల నుంచి మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఏడాదికి పైగా గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఊర చెరువు సమీపంలోని క్వారీ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాంపూర్ మీదుగా హనుమకొండ, వరంగల్ నగర శివార్లలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదే రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే మల్లకపల్లి రైతులు, పనులకు వెళ్లే కూలీలు నిత్యం తిరిగే వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువుతో భారీ వాహనాలు తిరగడం ద్వారా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం రాయల్టీ నష్టపోతున్నా, రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుకున్న ఎండు గంజాయితో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుషకుమార్, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన రాహుల్ మంజుదార్ (22), రాయపూర్‌కు చెందిన హరీష్ యాదవ్ (24), ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరికి చెందిన మండల నరేష్ (32)లతో ఎండు గంజాయిని ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూరు మీదుగా హైదరాబాద్ తరలించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన బాపన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాహుల్ మంజుదార్, హరీష్ యాదవ్, మండల నరేష్ ఒడిశా నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలంలోని మచ్చర్ల గ్రామం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వస్తున్న రెండు కార్లను ఆపి సోదా చేయగా సుమారు రూ.46.76 లక్షల విలువైన 187.04 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేసుకొని రాహుల్ మంజుదార్, మండల నరేష్, హరీష్ యాదవ్, బాపన్‌లపై కేసు నమోదు చేసి రెండు కార్లు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.

'ఐటీఐ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 5వ విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 83741 01790లో సంప్రదించాలన్నారు.

ఎనుమామూలు పనులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏడాది క్రితం రూ.17.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతేడాది ఆగస్టు 16న అప్పటి పాలకవర్గం గడువు ముగిసే రెండు రోజుల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక.. మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో.. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. మరోవైపు పనులకు సంబంధించి అప్పటి పాలకవర్గానికి, మార్కెట్ అధికారులకూ కమీషన్లు అందినట్లు ఆరోపణలున్నాయి. అందుకే తమ హయాంలోనే పనులు ప్రారంభించాలని.. వేగిరపడినట్లు తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్



అపరాల యార్డులో కమీషన్ దుకాణాల నిర్మాణాల పనులను మధ్యలోనే నిలిపేసిన గుత్తేదారు

రూ.కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కారణంగా.. ఫీజు రూపంలో మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. గతేడాది ఫీజు రూపంలో రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈ ఏడాది రూ.56 కోట్ల ఆదాయాన్ని సాధించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాలు లేక మార్కెట్‌లోని యార్డులు చీకటిగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి సీజన్లలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతు విశ్రాంతి భవనంలో మౌలిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాథమిక వైద్యశాలకు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలు, మందులు సమకూర్చేందుకు తగిన నిధులు కేటాయించకపోవడంతో.. రైతులతో పాటు మార్కెట్‌లోని కూలీలు, హమాలీలు, వ్యాపారులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి ఏడాది పూర్తయినా, మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు పాలకవర్గం నియామకంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. పత్తి, మిర్చి సీజన్లలో రైతులకు మద్దతుగా నిలవాల్సిన పాలకవర్గం ఏడాది నుంచి లేకపోవడంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

● ధాన్యం, అపరాల యార్డులో ఉప కార్యాలయం నిర్మాణం ● 47 ● 22.22
● మిర్చి యార్డులోని ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్ ● 444 ● 191
● పసుపు, పల్లికాయ యార్డులో ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్ ● 293 ● 64.77
● మార్కెట్ రెండో గేట్ వద్ద కళాతోరణం నిర్మాణం ● 29 ● 26.22
● మార్కెట్ రెండో గేట్ వద్ద ఎడ్లబండ్లు, రైతుల ప్రతిమలు ఏర్పాటు ● 9.20 ● 8.50
● ధాన్యం, అపరాల యార్డులో 24×12 వైశాల్యంతో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం ● 420 ● 73.01
● పత్తియార్డు కార్యాలయ మరమ్మతు పనులకు ● 17 ● 0
● పత్తియార్డు చుట్టుపక్కల ఉన్న డివైడర్లకు, బారికేడ్లకు సింథటిక్ పెయింటింగ్ పనులకు ● 10 ● 0
● మార్కెట్ చుట్టూ ప్రహరీ పనులకు ● 20 ● 0
● లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణం ● 418 ● 76.32

● అభివృద్ధి పనులు ● కేటాయించిన నిధులు(రూ.లక్షల్లో) ● ఇప్పటివరకు ఖర్చు (రూ.లక్షల్లో)



వేరుశనగ యార్డులో అసంపూర్తిగా షెడ్డు నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

పి.నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గుత్తేదారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించిన చెక్కులు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. కొంతకాలంగా గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ ఈఈ ద్వారా గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

‘గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం’

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు నగరంలో ‘స్వచ్ఛదనం- పచ్చదనం’ వెల్లివిరిసేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం బల్దియా సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత మంత్రి సురేఖ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత భారాస ప్రభుత్వం ముఖ్యమంత్రి హామీల పథకంలో పూర్తయిన పనులకు ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. వచ్చే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అన్ని పార్టీల కార్పొరేటర్లతో మాట్లాడించామన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. విలీన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కరీంనగర్, ఖమ్మం జాతీయ రహదారుల్లో సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సమాధుల కూల్చివేతపై ఆందోళన

కరీమాబాద్, న్యూస్‌టుడే: 33వ డివిజన్ శాంతినగర్ శ్మశానవాటికలో వందల ఏళ్ల నుంచి ఉన్న దేశ నాయకులు, దళిత ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల సమాధులను ఎలాంటి ప్రకటన చేయకుండా, స్థానికులను సంప్రదించకుండా.. వరంగల్ మహానగర పాలకసంస్థ కూల్చివేయడంపై హిందూ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రజలు సోమవారం ఆందోళన చేశారు. ఈ నెల 23న శ్మశానవాటికలోని బండారు నాగభూషణరావు(వరంగల్ నుంచి 3సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు), గతంలో స్వాతంత్ర్య సమరయోధుల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన బండారు చంద్రమౌళీశ్వర్‌రావు, ప్రఖ్యాత గాంధేయవాది ప్రసాదరావు, శైవ గురువు శివదేవుని వీరభద్రయ్య, ప్రఖ్యాత ఐఏఎస్ అధికారి ఎం.వీరభద్రయ్య, మొదటి పార్లమెంట్ సభ్యుడు, ప్రస్తుతం కాజీపేటలోని నిట్(ఎన్ఐటీ) తీసుకొచ్చిన ఇటికాల మధుసూదన్‌రావు, గాజుల జనార్దన్ తదితర నాయకుల సమాధులను కూల్చివేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన సమాధులను తిరిగి నిర్మించుకుంటామని హిందూ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

● సమాధులను కూల్చివేయడంపై భాజపా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ మంగళవారం శాంతినగర్ శ్మశానవాటికను సందర్శించారు. ఆందోళన చేస్తున్న హిందూ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులకు మద్దతు తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు, మేయర్, కమిషనర్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాలో పారదర్శకత పాటించండి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికలకు పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి సూచించారు. నర్సంపేట మండల పరిషత్తు కార్యాలయంలో డివిజన్‌లోని ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల ఓటరు జాబితా సవరణపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

ఉపాధి హామీలో అక్రమాలపై ఆగ్రహం

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తూ.. సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై డీఆర్డీఓ కౌసల్యాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో కూలీల సంతకాల్లో తేడాలు ఉన్నాయని, పనిచేయకుండా డబ్బులు తీసుకున్నారని వెల్లడించారు. అక్రమాలపై సామాజిక తనిఖీ సిబ్బందిని ప్రశ్నిస్తూనే.. నాటిన మొక్కలు కాపాడటంలో పంచాయతీ అధికారి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని డీఆర్డీఓ మండిపడ్డారు. సక్రమంగా విధులు నిర్వహిస్తే అక్రమాలు చోటుచేసుకోవని పేర్కొన్నారు.

☛ పంచాయతీరాజ్‌శాఖ ఏఈ గ్రామాల్లో చేపట్టిన పనుల రికార్డులు ఇవ్వకపోవడంతో తనిఖీ చేయలేకపోయామని సిబ్బంది డీఆర్డీఓకు వివరించారు. అదేంటి? పనులపై తనిఖీ ఉంటుందని తెలియదా? అంటూ కౌసల్యాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. 134 పనులకు సంబంధించిన ఎంబీలు, మస్టర్లు, ఎఫ్‌టీవో, స్టే ఆర్డర్లు ఇవ్వలేదని ఏపీవో సుశీల్‌కుమార్ డీఆర్డీవోకు వివరించారు. డీఆర్డీఓ సూచన మేరకు పంచాయతీరాజ్ ఏఈకి చరవాణిలో సమాచారం ఇచ్చారు. ప్రజావేదికలో మండల ప్రత్యేక అధికారిణి నీరజ, జిల్లా విజిలెన్స్ అధికారి పద్మనాభరెడ్డి, నాణ్యత ప్రమాణాల అధికారులు పుష్పలత, హరీష, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఏపీవో సుశీల్‌కుమార్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


సుమన్ (పాత చిత్రం)

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మాదన్నపేటకు చెందిన నిమ్మల సుమన్(35) కుటుంబ కలహాల కారణంగా మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేటలో వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్న ఆయన మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడుతుండేవారు. సోమవారం రాత్రి భార్యతో మరోసారి గొడవ పడ్డారు. మంగళవారం ఉదయం ఆవేశంలో పురుగుల మందు తాగారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు.

మానసిక సమస్యలతో మహిళ బలవన్మరణం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. ఉర్సు సుభాష్‌నగర్‌కు చెందిన సింగారపు సంధ్యారాణి(39)కి భర్తతో విడాకులు కావడంతో కొంతకాలంగా పుట్టింట్లోనే ఉంటున్నారు. మానసికంగా కుంగిపోయిన ఆమె మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. బాధితురాలి తల్లి తార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చోదకుడి ఆత్మహత్యాయత్నం

రంగంపేట: మేయర్ వ్యక్తిగత సహాయకుడు, ప్రజారోగ్య విభాగం అధికారి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ.. ప్రభుత్వ చోదకుడు జగన్ మంగళవారం ఉదయం మేయర్, ఉప మేయర్ల భవనం ఎదుట పురుగుమందు తాగాడు. ఒకవైపు కౌన్సిల్ సమావేశం కోసం మంత్రి, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు వెళ్లారు. చోదకుడు ఆత్మహత్యకు యత్నించడంతో అక్కడే ఉన్న ఉద్యోగులు ఆపారు. జగన్ గతంలో మేయర్ వాహనం చోదకుడిగా పనిచేశారు. మూడు నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జగన్ వాపోయారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

మామునూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందాడు. మామునూరు ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన సుతారి రమణాచారి(65) కుమారుడు వేణుతో కలిసి మంగళవారం చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత పూర్తి చేసుకొని బయటికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడగా అదే సమయంలో గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అక్రమంగా మట్టి తరలింపు.. కేసు నమోదు

పర్వతగిరి, న్యూస్‌టుడే: అనంతారం గ్రామంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన ఘటనలో మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌తో పాటు వాహన యజమానులు, చోదకులు బాలరాజు, రమా, రంజిత్, తిరుపతి, రాజు, అనిల్, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ మంగళవారం పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

వర్ధన్నపేట(వరంగల్), న్యూస్‌టుడే: వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం పట్టుకున్న గంజాయి కేసు వివరాలను వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దిల్లీ, బిహార్‌కు చెందిన వివేక్ కుమార్ మిశ్రా, ధర్మేందర్ మలాకర్, బాబీ దేవి, ద్రౌపతి, రీతికలతో కూడిన అయిదుగురు సభ్యుల ముఠా.. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణా చేయాలని నిర్ణయించుకున్నారు. దిల్లీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం వెళ్లారు. అక్కడ గంజాయి వ్యాపారం చేస్తున్న రవిని కలిశారు. అతడు గంజాయిని దిల్లీలోని అరవింద్‌కు ఇస్తే రూ.50 వేలు ఇస్తానని ముఠా సభ్యులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 21న విశాఖపట్నం నుంచి నాలుగు సంచుల్లో 27.41 కిలోల గంజాయి తీసుకున్న ముఠా సభ్యులు నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో దిల్లీకి బయల్దేరారు. 22న ఉదయం రైలు కాజీపేటకు చేరుకోగా.. పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ విషయం గమనించి.. గంజాయి సంచులతో రైలు దిగి రోడ్డు మార్గంలో వర్ధన్నపేట బస్టాండ్‌కు చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు బస్టాండ్‌లో తనిఖీ చేపట్టి.. గంజాయితో సహా ముఠా సభ్యులను పట్టుకున్నారు. వివేక్ కుమార్ మిశ్రా, ధర్మేందర్ మలాకర్, బాబీ దేవి, ద్రౌపతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రీతిక, రవి, అరవింద్‌లు పరారీలో ఉన్నట్లు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమ పథకాల అమలు


సమావేశంలో ప్రసంగిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుమారు 83 మంది లబ్ధిదారులకు రైతు వేదిక ప్రాంగణంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ‘స్వచ్ఛతా హీ సేవా’ వారోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్వీయచిత్ర కేంద్రం(సెల్ఫీ పాయింట్)ను ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్, ఎంపీఓ ప్రకాష్, ఏవో వీరభద్రం, నాయకులు హమ్యానాయక్, రవీందర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని తిర్మలాయపల్లి కస్తూర్బా బాలికల పాఠశాల/కళాశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, తాగునీరు, భోజన వసతి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ప్రిన్సిపల్ కవితకు సూచించారు.

రాయపర్తి: మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువులో వ్యర్థాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశించారు. ‘కాలుష్యపు కోరల్లో మంచినీటి తటాకం’ అనే శీర్షికన మంగళవారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. స్థానిక నాయకులతో కలిసి చెరువును పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్సారెస్పీ ఈఈ రమేశ్‌బాబుతో చరవాణిలో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, కోళ్ల పరిశ్రమ వ్యర్థాలు చెరువులో కలిస్తే సదరు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా


కాశీబుగ్గలో కొమ్ముల సందీప్‌తో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఎల్బీనగర్‌లో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసిన కాంగ్రెస్ 21 డివిజన్ కొమ్ముల సందీప్‌ను మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పరామర్శించారు. కాశీబుగ్గలోని సందీప్ ఇంటికి వెళ్లిన స్వర్ణ అరెస్టుకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ డీసీసీ అధ్యక్షురాలికి పోలీసులు వ్యవహరించిన తీరును వివరించారు. గత ఎన్నికల్లో కొండా సురేఖ గెలుపు కోసం తనవంతుగా కష్టపడ్డానని సందీప్ గోడు వెల్లబోసుకున్నారు. ఏడాది క్రితం వరకు తనకు ఉద్యోగం ఉండేదని, నెలకు రూ.30 వేల జీతం వచ్చేదని, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన పాపానికి ఉన్న ఉద్యోగం పోయి, ఇప్పుడు రోడ్డుపక్కన కొబ్బరి బోండాలు అమ్ముకుంటున్నానని సందీప్ వాపోయారు. సొంత పార్టీ నేతలే తనను అరెస్టు చేయించి పోలీసులతో కొట్టించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ స్పందిస్తూ.. మీకు జరిగిన అన్యాయం గురించి పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు గుండేటి నరేందర్, పోశాల పద్మ, మాజీ కార్పొరేటర్ తత్తర లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, నాయకులు జన్ను రవి, కరాటే ప్రభాకర్, పోశాల స్వామి, పరమేశ్ తదితరులున్నారు.

సామాజిక సేవా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం


ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చిలుక మురళితో విద్యార్థులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ‘సేవాసే సీఖేన్-24’ అనే అనుభవాత్మక అభ్యాస కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి ఆధ్వర్యంలో మేరా యువ భారత్(మైభారత్) తరపున జిల్లా అధికారి అన్వేష్ చింతల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం 12 మంది దరఖాస్తు చేసుకోగా. . చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు 120 గంటల పాటు(30 నుంచి 60 రోజులు) జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. దీనిద్వారా యువతకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించడం, సామాజిక సేవా స్ఫూర్తి పెంపొందించడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎంపికైన అయిదుగురు విద్యార్థులు మంగళవారం ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చిలుక మురళిని కలిశారు. ఆయన ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఫోర్ట్‌రోడ్, శివనగర్ 11కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు. దీంతో చింతల్, పుప్పాలగుట్ట, ఆదర్శనగర్, ఖిలావరంగల్ మధ్య, పడమర, తూర్పుకోట ప్రాంతాలతో పాటు శివనగర్, స్తంభంపల్లి గ్రామంలో అంతరాయం ఉంటుందన్నారు.

ఉద్యమ నాయకుల ఆశయాలు కొనసాగిద్దాం


చంద్రక్క, ముక్తార్‌పాషా చిత్రపటాల వద్ద జోహార్లు అర్పిస్తున్న న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ప్రతినిధులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట నాయకురాలు పైలా చంద్రక్క, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర నాయకులు ముక్తార్ పాషా సంస్మరణ సభ మంగళవారం ఖిలావరంగల్ పడమరకోట అమరవీరుల స్తూపం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. వీరిని స్మరిస్తూ మౌనం పాటించి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు ప్రసంగించారు. ప్రజా సంఘాల నాయకులు విజయపాల్, సాంబయ్య, కృష్ణ, ప్రభాకర్, రాజేందర్, రాజు, పాణి, అక్బర్, నారాయణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వేణుమాధవ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఇంటర్‌లో నేడు తక్షణ ప్రవేశాలు

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ అపర్ణ మంగళవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో మిగిలిన 15 సీట్ల భర్తీకి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

27న యోగా టీచర్ పోస్టులకు ముఖాముఖి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు ప్రాంతీయ ఆయుష్ శాఖ ఆర్‌డీడీ ప్రమీలాదేవి, ఆయుష్ జిల్లా ఇన్‌ఛార్జి డా.మైదం రాజు తెలిపారు. యోగా టీచర్ల నియామకానికి ఈ నెల 27న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆయుష్‌శాఖ ఆర్‌డీడీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జూనియర్ అధ్యాపకుల సంఘం ఎన్నిక

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎల్.కొమురారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.రమణాకర్, ఉపాధ్యక్షుడిగా కె.మహిపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బి.హరికృష్ణ, కోశాధికారిగా జి.శశిధర్, మహిళా కార్యదర్శిగా పి.ఉమాదేవి ఎన్నికయ్యారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. భాజపా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం సెంటర్లో భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నాయకులు దయాకర్, చక్రపాణి, జనార్దన్, వీరస్వామి, సదానందం, అనిత తదితరులున్నారు.

విద్యాబోధన మెరుగుపరుచుకోండి

గీసుకొండ, న్యూస్‌టుడే: అధ్యాపకులు బోధనా పద్ధతులను మెరుగుపరుచుకుంటూ బోధన చేయాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) డా.శ్రీధర్‌సుమన్ తెలిపారు. గీసుకొండ మండలం వంచనగిరిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించి సిబ్బంది హాజరుతోపాటు విద్యార్థుల కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌కు అవసరమైన ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర సదుపాయాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి హిమబిందు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

శివనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను పరిరక్షించి, పేదలకు పట్టాలిచ్చి.. పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పేర్కొన్నారు. మంగళవారం శివనగర్ తమ్మెరభవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, లక్ష్మణ్, రవీందర్, బద్రి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

యాప్‌లో నమోదు చేయండి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: దివ్యాంగ విద్యార్థులను గుర్తించి ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కమ్యూనిటీ అధికారి సుభాష్, జిల్లా ఆకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ అన్నారు. మంగళవారం చెన్నారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు యాప్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎంపీడీవో శ్రీవాణి, ఎంఈవో రత్నమాల, ప్రధానోపాధ్యాయులు పాపమ్మ, జయ, సలీమ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు కోరుతూ 27న కలెక్టరేట్ ముట్టడి

నర్సంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు బకాయి బిల్లులు సత్వరమే విడుదల చేయాలని మాజీ సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సంపేటలో జరిగిన మాజీ ప్రజా ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 26న ఎమ్పీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా, 27న కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు.

స్థానికులకే ఉద్యోగాలివ్వాలని ధర్నా

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, వైద్యశాలలోని ఉద్యోగ ఖాళీలను స్థానికులకు ప్రాధాన్యమిచ్చి భర్తీ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆ రెండు సంఘాల ఆధ్వర్యంలో మహిళలు, యువజనులు పలువురు నిరుద్యోగులు మంగళవారం నర్సంపేట ఆర్డీవో కార్యాలయం చేరుకుని అక్కడ ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కృష్ణవేణికి అందజేశారు.

అన్యమత ప్రచారం అడ్డగింత

నల్లబెల్లి, న్యూస్‌టుడే: లెంకాలపల్లి గ్రామంలో అన్యమత ప్రచారం చేస్తున్న పలువురిని మంగళవారం స్థానికులు అడ్డుకున్నారు. ఓ ప్రైవేటు వాహనంలో మైకుల ద్వారా అన్యమతాన్ని ప్రచారం చేస్తుండటాన్ని గుర్తించి వారికి అడ్డుపడ్డారు. ఇలా ప్రచారం చేయడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అన్యమత ప్రచారకులను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఆకాశవాణిలో తొగర్రాయి విద్యార్థుల కదంబ కార్యక్రమం



దుగ్గొండి, న్యూస్‌టుడే: వరంగల్ ఆకాశవాణి రేడియో కేంద్రంలో దుగ్గొండి మండలం తొగర్రాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ‘చిన్నారి లోకం’లో భాగంగా కదంబ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సమన్విత యాంకర్‌గా వ్యవహరించారు. కవితలు గేయాలు. కథలు, పాటలు, విద్యావ్యాసాలు చదివి వినిపించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాసులు గైడ్ టీచరుగా వ్యవహరించారు.

ఏఎల్ ఓపై చర్యలకు డిమాండ్

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట సహాయ కార్మికాధికారిపై రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం విస్మయాన్ని కలిగిస్తోందని భవన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్ అన్నారు. మంగళవారం నాడిక్కడ మాట్లాడుతూ.. కార్మికశాఖ సంయుక్త కమిషనర్(జేసీఎల్), కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్(డీసీఎల్)కు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు అందించినా విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు.

హిందూ సంఘాల నిరసన

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీకి నిరసనగా గురిజాల, మహేశ్వరం గ్రామాల్లో మంగళవారం హిందూ సంఘాలు నిరసన తెలిపాయి. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సంఘ నేతలు యాదగిరి, నరేందర్, శ్రీనివాస్, కుమారస్వామి, జంపయ్య తదితరులు డిమాండ్ చేశారు.

జలవనరులను కలుషితం కానీయొద్దు

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జలవనరులను కలుషితం కాకుండా చూస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని బాలాజీ టెక్నో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్‌సీసీ పదో బెటాలియన్ వాలంటీర్ల ఆధ్వర్యంలో మహేశ్వరంలో అవగాహన ర్యాలీ, చెరువులో చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

ఖానాపురం: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సదానందం అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా పథకం కార్యకలాపాలు, విలువలను వివరించారు.

‘కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు’

నర్సంపేట, న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల కొమ్ము కాస్తున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఎ.రాజేందర్, జిల్లా నాయకులు జి.కృష్ణ, జె.తిరుపతి విమర్శించారు. మంగళవారం నర్సంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద ఆ పార్టీ నాయకులు చంద్రక్క, ముక్తార్ బాషాలకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన నాలుగో వర్ధంతి సభలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు సారంగపాణి, వెంకటస్వామి, ఐలన్న, పూలక్క, వీరస్వామి, సాంబన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఆవశ్యకతపై అవగాహన


ఎల్బీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో ఈఓ శేషుభారతి

దేశాయిపేట, న్యూస్‌టుడే: నీటి ఆవశ్యకతపై విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. మంగళవారం వరంగల్ ప్రభుత్వ సీకేఎం కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు దేశాయిపేట నుంచి పోచమ్మమైదాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా నీటి ప్రాముఖ్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పోచమ్మమైదాన్ కూడలిలో నదుల సంరక్షణపై ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రమాణం చేయించారు. ఎన్‌సీసీ అధికారి డా.సతీష్‌కుమార్, అధ్యాపకులు స్రవంతి, హరిబాబు, ప్రకాశం, సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట: ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ లాల్‌బహదూర్ కళాశాల 10వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేశారు. ములుగురోడ్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, భద్రకాళి చెరువు మత్తడి, శ్రీభద్రకాళి దేవస్థానంలో పరిసరాలు శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ డా.అరుణ, ఈవో శేషుభారతి, కెప్టెన్ డా.సదానందం పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం

కీర్తినగర్‌కాలనీ(గీసుకొండ): విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచడానికి ఎన్‌సీసీ తోడ్పడుతుందని వరంగల్ ఎన్‌సీసీ పదో బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్ సెంథిల్‌రామ్ దొరై తెలిపారు మొగిలిచెర్లలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి గ్రామంలోని పడమటి చెరువును శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ చీఫ్ రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి సదస్సులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: పొగాకు రహిత సమాజం కోసం నేటి నుంచి 60రోజుల వరకు ప్రతి పాఠశాల, కళాశాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డా.గోపాలరావు అధ్యక్షతన వరంగల్ ఏవీవీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ భుజేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, ఎన్‌సీడీ అధికారి ప్రకాశ్‌రెడ్డి, సోమేశ్వర్, నర్మదా, లక్ష్మి, రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ సీఐ ఐజీ కార్యాలయానికి అటాచ్

రంగశాయిపేట, న్యూస్‌టుడే: మిల్స్‌కాలనీ సీఐగా పనిచేస్తున్న మల్లయ్యను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత విధుల్లో చేరిన ఆయన అనతికాలంలోనే బదిలీ కావడం, కొత్తగా ఎవరినీ నియమించక పోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

విద్యుత్తు సామగ్రి పట్టివేత

వరంగల్‌క్రైం: ఇతర ప్రాంతాల్లో నాసిరకం విద్యుత్తు సామగ్రి కొనుగోలు చేసి, ప్రముఖ కంపెనీల పేరుతో అమ్ముతున్న తీగలు, స్విచ్చులు, సామగ్రిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... వరంగల్ అండర్ బ్రిడ్జి, శివనగర్‌లోని శ్రీపార్వతి ఎలక్ట్రికల్స్ యజమాని చౌదరి ధనరావు తన దుకాణంలో ప్రముఖ కంపెనీల పేరుతో నాసిరకం సామగ్రిని విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసగిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం రావడంతో మంగళవారం రాత్రి మిల్స్ కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దుకాణంపై దాడి చేశారు. సుమారు రూ.29.67లక్షల విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు, విచారణ కోసం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు.

రాంపూర్‌లో మెగా వైద్య శిబిరం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల నిపుణుల ఆధ్వర్యంలో రాంపూర్‌లో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 285 మందిని పరీక్షించి తగిన చికిత్స అందించినట్లు జిల్లా ఉప వైద్యాధికారి ప్రకాశ్ చెప్పారు.

రాయితీ బియ్యం స్వాధీనం



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే రాయితీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ధాన్యం మిల్లుపై టాస్క్‌ఫోర్స్, నెక్కొండ పోలీసులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు చెన్నారావుపేట మండలం ఆర్కే తండాకు చెందిన యాకూబ్ గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు రాయితీ బియ్యాన్ని సేకరించి రైస్‌మిల్లులో నిల్వ ఉంచి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈమేరకు అందిన సమాచారంతో మంగళవారం దాడులు నిర్వహించి 62 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ కోసం పౌరసరఫరా అధికారులకు అప్పగించామని తెలిపారు.